క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి



వినుకొండ(నూజెండ్ల): వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని కడప, తిరుపతి, నెల్లూరు రీజినల్ దివ్యాంగుల విభాగం రీజినల్ కో-ఆర్డినేటర్ కొమ్మిరెడ్డి శివారెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లాయర్స్ స్ట్రీట్‌లోని కార్యాలయంలో శివారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవి ఇచ్చిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి, దివ్యాంగుల్ని ఏకతాటి పైకితెచ్చి 175 నియోజకవర్గాల్లో పార్టీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చింతల చెర్వు వెంకిరెడ్డి, కొత్తా వీరాంజేయరెడ్డి, దాట్ల అంజిరెడ్డి, దివ్యాంగుల సంఘం నాయకులు హనుమాన్ నాయక్, భీమిశెట్టి శ్రీనివాసులు, నాగేషు, జాన్‌పాల్ పాల్గొన్నారు.

గిరిజన ఐక్యవేదిక నూతనకమిటీ ఎన్నిక



నాదెండ్ల: స్థానిక ఏకలవ్యనగర్ కాలనీలో ఆదివారం ప్రాథమిక పాఠశాల సమీపంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనునాయక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా మొగిలి సాంబయ్య, అధ్యక్షుడిగా కుంభా కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా తోకల ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శిగా మొగిలి వెంకట నారాయణ, సహాయ కార్యదర్శిగా కుంభా నారాయణ, కోశాధికారిగా మేడ సుబ్బారావుతో పాటూ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బాలకృష్ణ, పాలపర్తి శ్రీను, కె. కోటిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పి. శ్రీనివాసరావు, జాతీయ సంక్షేమ నాయకులు కొండ్రముట్ల నాగేశ్వరరావు, మాదాసు పృథ్వీ పాల్గొన్నారు.

మాతాశ్రీ హాస్పిటల్‌లో లాప్రోస్కోపీ, ఎండోస్కోపీపై వర్క్‌షాప్



నరసరావుపేట: స్థానిక మాతాశ్రీ హాస్పిటల్‌లో ఆదివారం డాక్టర్ పి.రామచంద్రారెడ్డి నేతృత్వంలో లాప్రోస్కోపీ, ఎండోస్కోపీపై లెపెండోకాన్-2023 వర్క్‌షాప్ నిర్వహించారు. గుంటూరు మెడికల్ కాలేజీ, కాటూరి మెడికల్ కాలేజీలకు చెందిన ట్రైనింగ్ సర్జన్లు, స్థానిక యువ సర్జనులు హాజరయ్యారు. సుమారు 15 మంది మెడికల్ విద్యార్థులు కూడా భాగస్వామ్యమయ్యారు. డాక్టర్ రామచంద్రారెడ్డి వీరికి లాప్రోస్కోపిక్, ఎండోస్కోపీ, ఎండో సూచరింగ్ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. వర్క్‌షాప్ విజయానికి సహకరించిన విద్యార్థులు, హాస్పిటల్స్ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలకలూరిపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా మార్టూరు మండలం బొబ్బేపల్లి గ్రామానికి చెందిన నూతలపాటి సుబ్బరామయ్య(65) వ్యవసాయ పనులు చేస్తుంటారు. పురుగు మందుల కోసం ఈ నెల 7న ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేటకు వచ్చారు. వాటిని కొనుగోలు చేసి తిరిగి వెళుతుండగా పసుమర్రు దాటిన తర్వాత కుక్క ఎదురు రావటంతో అదుపుతప్పి పడిపోయారు. గాయపడిన ఆయన్ను స్థానికులు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. కుమారుడు వేణుబాబు ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

రేపల్లె: మండలంలోని రావి అనంతవరం గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్లు సీఐ విజయ చంద్ర తెలిపారు. వారి వద్దనుంచి రూ.15,150 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుల్ని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి వివరాల్ని 9440796169కు తెలియజేయాలని ప్రజల్ని కోరారు.

రానున్న ఎన్నికల్లో విజయమే ధ్యేయం

- వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవంలో నేతల పిలుపు
- పార్టీ కార్యాలయాల్లో కేక్ కటింగ్‌లు, జెండా ఆవిష్కరణ



నరసరావుపేట పార్టీ కార్యాలయంలో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు



వినుకొండలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పార్టీ కార్యాలయాల్లో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాల్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పార్టీ జెండాను ఆవిష్కరించి అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధుల మధ్య భారీ కేక్ కట్ చేశారు. పట్టణంలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 12 ఏళ్ల క్రితం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒంటరిగా పార్టీని స్థాపించి పాదయాత్ర చేసి అఖండ మెజార్టీతో ముఖ్యమంత్రి అయ్యారని తెలిపారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలు పనిచేసి రానున్న రోజుల్లో మరలా అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జడ్పీటీసీ జడ్డా సుబ్బులురామయ్య, సొసైటీ చైర్‌పర్సన్లు పొట్లపల్లి పిచ్చిరెడ్డి, పారా వెంకటేశ్వర్లు, అనుమోలు నాసరరెడ్డి, మండల కన్వీనర్లు నక్కా నాగిరెడ్డి, దండు చెన్నయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ తెల్లాకు రాజేష్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, కృష్ణానాయక్, జక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జక్కిరెడ్డి సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు ఎంఎస్‌కే బాషా, కాంట్రాక్ట్ గౌస్ బాషా, పాపసాని బ్రహ్మయ్య, నరాలశెట్టి శ్రీనివాసరావు, చీరపురెడ్డి పుల్లారావు, రొడ్డా పుల్లారెడ్డి, ములకా రామతులసీరెడ్డి, గంధం కోటి, మస్తాన్ వలి, యారం రామిరెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశానికే మార్గదర్శకం వైఎస్సార్‌సీపీ పాలన

నరసరావుపేట: దేశానికే మార్గదర్శకంగా వైఎస్సార్ సీపీ సుపరిపాలన అందజేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని అరవై అడుగుల రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పార్టీ జెండా ఆవిష్కరించారు. మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి, కేక్ కట్ చేశారు. ఎస్ఎస్పీ కాలనీలోని డాక్టర్ వైఎస్సార్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మళ్లీ 2024 ఎన్నికల్లో సీఎం జగన్‌ను చేసుకోవాలని, నరసరావుపేటలో పార్టీని హాట్రిక్ విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో పోడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, నరసరావుపేట, రొంపిచర్ల మార్కెట్ యార్డు చైర్మన్లు ఎస్.ఏ.హనీఫ్, పచ్చవ రవీంద్ర బాబు, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరక్టర్ చింతా కిరణ్, మూడు జిల్లాల జోన్ ఎస్టీసెల్ కన్వీనర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు పదముత్తం చిట్టిబాబు, పిల్లి ఓబులురెడ్డి, ఎంపీపీలు మోరబోయిన శ్రీనివాసరావు, గడ్డం వెంకటరావు, సచివాలయ కన్వీనర్ ఇన్‌చార్జిలు మద్దిరెడ్డి నరసింహారెడ్డి, ఎస్‌కే ఆంజనేయులు, యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి గంటినపాటి గాబ్రియేలు, జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల ఎజ్రా, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు అచ్చి శివకోటి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లెల అశోక్, మాజీ కౌన్సిలర్లు వేలూరి సుబ్బారెడ్డి, మాడిశెట్టి మోహనరావు, బత్తుల లక్ష్మీపద్మలత, మాగులూరి రమణారెడ్డి, నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కామిరెడ్డి నాగిరెడ్డి, సమాఖ్య నాయకురాలు సయ్యద్‌ఫాతిమా, సీహెచ్.అనూరాధారెడ్డి, రొంపిచర్ల మాజీ సర్పంచి గెల్లి చినకోటిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయాల కొనసాగింపే పార్టీ లక్ష్యం

మంత్రి విడదల రజిని



వైఎస్సార్ విగ్రహానికి నమస్కరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రజిని మాట్లాడుతూ జగనన్న చేతిలో పురుడుపోసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దిగ్విజయంగా 13వ వసంతంలోకి అడుగుపెట్టడం గర్వంగా ఉందని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఆశయాలను కొనసాగించటమే లక్ష్యంగా తమ పార్టీ పని చేస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు, ప్రజలను సంక్షేమం దిశగా నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు మద్దతుగా నిలవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్లు కొలిశెట్టి శ్రీనివాసరావు, వలేటి వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైస్ చైర్మన్ ఎం. వీరారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు కోడె సుధారాణి, కాట్రగడ్డ మస్తాన్‌రావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు గుత్తా వేములయ్య, షేక్ గాలిబ్‌షా, షేక్ అల్లీమియా, సయ్యద్ బషీర్ మేస్త్రి, దాసరి మర్తు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తిరునాళ్ల సందడి



ఏకోనారాయణస్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా తదితరులు



మర్రిచెట్టుపాలెంలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

ఈపూరు: మండలంలోని పలు గ్రామాల్లో తిరునాళ్ల సందడి నెలకొంది. అగ్నిగుండాలలో శ్రీ తిరుమలనాథస్వామి తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని పొంగుబాలు సమర్పించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్య అతిథిగా హాజరై స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్రను కమిటీ సభ్యుల్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోపెల దేవరాజ్, నేత అంకిరెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

బొల్లాపల్లిలో ఏకోనారాయణ స్వామి..

బొల్లాపల్లి: స్థానిక శ్రీ వెంకట ఏకోనారాయణస్వామి తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు ఆలయానికి చేరుకుని పొంగళ్లను స్వామికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సాయంత్రం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ, అర్చకులు ఆయన్ను శాలువాతో ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామి చల్లని దీవెనలతో ఈ ప్రాంతం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

పేరూరుపాడులో..

మండలంలోని పేరూరుపాడులో శ్రీ నీలంపాటి లక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మండల గ్రామ నాయకులు, కార్యకర్తలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మర్రిచెట్టుపాలెంలో శ్రీ వీరాంజనేయస్వామి...

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామ పరిధిలో గల మర్రిచెట్టుపాలెం శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. శ్రీ వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పలువురు దాతలు, సేవా సంస్థలు తిరునాళ్లలో భక్తులకు అన్నదానాలు, అల్పాహారాలు, మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు. రాత్రి ఏర్పాటు చేసిన భజనలు ఆకట్టుకున్నాయి. గ్రామస్తులు భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రొంపిచర్ల పోలీసులు శాంతిభద్రతల్ని పర్యవేక్షిస్తున్నారు.

ఎన్నికల్లో గృహ సారథులు, వలంటీర్లే కీలకం

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: రాబోయే ఎన్నికల్లో జగనన్న సైన్యమైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు కీలకమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని కోటప్పకొండ సాయిమందిరం కల్యాణ మండపంలో ఆదివారం కొండకావూరు, పమిడిమర్రు, కాకాని, పెట్లూరివారిపాలెం, గురవాయపాలెం, గొనెపూడి, చింతలపాలెం, చినతురకపాలెం, ఉప్పలపాడు, లక్ష్మీపురం, అర్వపల్లి గ్రామాల సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ఈనెలలో అసెంబ్లీ కార్యక్రమాలు పూర్తయిన తరువాత మా నమ్మకం .. నువ్వే జగన్ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. వలంటీర్ క్లస్టర్ పరిధిలో ఇద్దరు గృహ సారథులు(పురుషుడు, మహిళ)ను ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. వలంటీర్లు, గృహ సారథులను సమన్వయంతో ముందుకు నడిపించే బాధ్యత సచివాలయ కన్వీనర్లపై ఉందని చెప్పారు. వలంటీర్లు, గృహ సారథులు టీమ్‌గా ఉర్పడి తమ క్లస్టర్ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించాలని తెలిపారు. గృహ సారథులు కేవలం పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలోని సభ్యులతో పరిచయ కార్యక్రమంతో పాటు ప్రజా మద్దతు, ప్రజాభిప్రాయ సేకరణ, ప్రతి ఇంటికీ స్టిక్కర్ వేసే కార్యక్రమాన్ని గృహ సారథులు చేపట్టాల్సి ఉంటుందని వివరించారు. గృహ సారథుల కుటుంబానికి రూ.5లక్షల బీమాను వైఎస్సార్ సీపీ కల్పించినట్టు తెలిపారు. దీంతో పాటు రానున్న రోజుల్లో వీరికి తగిన ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పిల్లి ఓబుల్‌రెడ్డి, పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, సచివాలయ మండల కన్వీనర్ సాదినేని రాంబాబు, వైస్ ఎంపీపీ వెంకటప్పారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యాలయం ప్రారంభం

నరసరావుపేట: ఆర్టీసీ డిపో సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఏ.చిన్న, ఎం.వి.రెడ్డి, జోనల్ నాయకుడు డి.బి.నాయక్, జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సీహెచ్.మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

పలు ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెం, రొంపిచర్ల గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం పర్యటించారు. స్వగ్రామమైన బుచ్చిబాపన్నపాలెంలో నీలంపాటి అమ్మవారి జయంతి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన అన్నదానాన్ని గ్రామ పెద్దలతో కలసి ప్రారంభించారు. ఇటీవల మృతి చెందిన ఇరగదిండెల రమణయ్య కుటుంబాన్ని పరామర్శించారు. సొంత నిధుల నుంచి రూ. లక్ష అందజేశారు. అనంతరం రొంపిచర్లలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిర 24వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. మందిరంలో పూజలు నిర్వహించి, అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని ఆలయ ధర్మకర్తలు సన్మానించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త వినుకొండ పవన్, కిరణ్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గెల్లి సుబ్బారెడ్డి, చీమల శ్రీనివాసరెడ్డి, గెల్లి చినకోటిరెడ్డి, బత్తుల కొండలు పాల్గొన్నారు.

నేటి నుంచి అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ జలాలు

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామ సమీపాన అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు వారాబందీ ద్వారా ఈనెల 13 నుంచి 20 వరకు 1600 క్యూసెక్కులు నీటిని విడుదల చేయనున్నట్లు ఎన్నెస్పీ డీఈ చాట్రగడ్డ రామారావు ఆదివారం తెలిపారు. ముఖ్యంగా ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులంతా జలాలు వృథా కాకుండా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. గ్రామాల్లోని మంచినీటి చెరువుల్ని నింపుకోవాలని తెలిపారు.

22న శ్రీ అడవి పేరంటాళ్లమ్మ తిరునాళ్ల

శావల్యాపురం: ఉగాది పురస్కరించుకొని మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెంలో ఈనెల 22న శ్రీ అడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి తిరునాళ్ల నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల (బాలికలు)లో 2023-24 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.వెంకటమ్మ తెలిపారు. ఈ నెల 24వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 23న ఉదయం 10గంటలకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.

విజయపురిసౌత్‌లో..

స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఈ నెల 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ లక్ష్మీరాజ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80, బైపీసీ-40, ఎంపీసీ-40 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. 5వ తరగతికి ఏప్రిల్ 23న ఉదయం 10 నుంచి 12గంటల వరకు, ఇంటర్మీడియట్‌కు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు

శావల్యాపురం: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మంగళవారం 1నుంచి 19 సంవత్సరాల వారందరితో బిళ్లలు మింగించడానికి ఏర్పాట్లు చేసినట్లు మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం తెలిపారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. శావల్యాపురం మండలంలో 6347 మందిని గుర్తించామని చెప్పారు. ఇప్పటికే ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులకు, వైద్య ఆరోగ్య సిబ్బందికి మందు బిళ్లల బాక్సులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు బాలిబోయిన లక్ష్మీప్రసన్న, ధనలక్ష్మి, ప్రమీల, ఫార్మాసిస్ట్ లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్లు సూర్యకుమార్, సాయిగీత, ఆరోగ్య కార్యకర్త ఇంకొల్లు నాగలక్ష్మి పాల్గొన్నారు.

కుమ్మర శాలివాహన సంఘం నూతన కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల) : నియోజకవర్గ కుమ్మర శాలివాహన సంఘం నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు ఐలాపురం వెంకయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌బాబు ఆధ్వర్యంలో పట్టణంలోని ఫర్టిలైజర్ అసోసియేషన్ హాలులో ఆదివారం ఎన్నుకున్నారు. కార్యక్రమానికి పల్నాడు జిల్లా సంఘ అధ్యక్షుడు పార్శెళ్ల రమేష్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌బాబు హాజరయ్యారు. శాలివాహన సంఘీయులు ఐకమత్యంతో ఉండి రాజకీయంగా ఎదగాలని కోరారు. అనంతరం సంఘం నూతన అధ్యక్షుడిగా గొట్టం గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శిగా మద్దికుంట ఆదినారాయణ, కోశాధికారిగా పార్శెళ్ల లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా పార్శెళ్ల దాసయ్య, రాజారపు కృష్ణ, చీరాల ఆంజనేయులు, చీరాల కోటయ్య, వివిధ మండలాల సంఘం అధ్యక్షులుగా రాజారపు ఏడుకొండలు, వినోద్‌బాబు, పార్శెళ్ల కమలాకర్‌రావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజారపు ఏడుకొండలు, శ్రీశైలం శాలివాహన నిత్య అన్నదాన సత్రం కోశాధికారి బొమ్మని శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మొగిలిచర్ల సుబ్బారావు, గుంటూరు జిల్లా సంఘం అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ, పట్టణ అధ్యక్షుడు బొంకూరి రోశయ్య, యువజన విభాగం అధ్యక్షుడు మామిళ్లపల్లి సుబ్బారావు, గుంటూరు పట్టణ అధ్యక్షుడు పొరల అంకమ్మరావు, పార్శెళ్ల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

సంకురాత్రిపాడులో కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోడు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా, నాయకులు

నాదెండ్ల: మండలంలోని సంకురాత్రిపాడులో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మ్యాక్సీ విజన్, శ్రీవకేర్ సౌజన్యంతో జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. గతంలో కంటి పరీక్షలు చేయించుకుని ఆపరేషన్లు చేయించుకున్న వారికి ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా ఆధ్వర్యంలో కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకలూరిపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించి, మందులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొక్కెర చిట్టిబాబు, 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, గొంటు శ్రీనివాసరెడ్డి, జమ్ములమడక ఆదిబాబు, మానుకొండ శేషిరెడ్డి, కరీం, రఫీ, జిలాని, ఇమ్రాన్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని

చిలకలూరిపేట టౌన్: పోరాడి సాధించుకున్న శ్రామిక మహిళా పోరాటం స్ఫూర్తిగా తీసుకొని మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి పి. దుర్గాభవాని చెప్పారు. ఏపీ మహిళా సమాఖ్య చిలకలూపేట ఏరియా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎందరో బలిదానాలతో సాధించుకున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. ప్రస్తుతం సమాజంలో కుల,మత విద్వేషాల్ని రెచ్చగొడుతున్నారని, ఆయా శక్తుల పట్ల మహిళలు అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ, నరసరావుపేటకు చెందిన వైద్యురాలు డాక్టర్ సి. గౌతమి, సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ. మారుతీవరప్రసాద్, ఉమ్మడి గుంటూరు జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాగభైరు సుబ్బాయమ్మ, సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, బి. లలిత కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్ధమాన గాయని బెల్లంకొండ భారతిని సన్మానించారు.

పేద దళిత రైతులకు డీకే పట్టాలు ఇవ్వాలి

నాదెండ్ల: తరతరాలుగా దళితులు సాగు చేసుకుంటున్న భూముల్ని అధికారులు 1బీ, అడంగలులో నమోదు చేసి డీకే పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు కారసాల రోశయ్య, అనుమల లక్ష్మీశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని గొరిజవోలులో దళితులు సాగు చేసుకుంటున్న పంట పొలాల్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్ 296లో సుమారు 160 ఎకరాల భూమి ఉండగా, అందులో 20 ఎకరాలు తాగునీటి చెరువు కోసం విడగొట్టారని తెలిపారు. కొంత వాగు, కరకట్టలకు పోను మిగిలిన భూమిని దళితులు గత 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నాయకులు ఇందులో నీరు-చెట్టు పేరిట మట్టి తవ్వకాలు చేసి, భూమిని కాజేయాలని చూశారని ఆరోపించారు. అప్పట్లో కార్మిక సంఘాలు, పేదలు ఐక్యమై అడ్డుకున్నట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి పేద దళిత రైతులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం అసైన్డ్ భూముల పరిరక్షణ, డీకే పట్టాల సాధనకు అధ్యక్ష , కార్యదర్శులుగా లక్కిపోగు పెద్దబ్బాయి, గొర్రెపాటి ప్రకాశరావులతో మరో తొమ్మిది మంది సభ్యులతో భూ పోరాట కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రావినూతల పుల్లయ్య, యర్రా మస్తానయ్య, కె. గాలేసు, దానేలు, జోజి, పెదమస్తానయ్య, వెంకయ్య, మస్తాన్‌రావు, ప్రభుదాసు పాల్గొన్నారు.